క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: సంజీవయ్య పార్కు, ఎయిర్‌పోర్ట్, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హుడా లేన్, చిరాన్‌పోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ప్యారడైజ్ డివిజన్ పరిధిలో..

జమిస్తాన్‌పూర్, చిలకలగూడ, పాటిగడ్డ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు టీఆర్ అపార్ట్‌మెంట్, ఎల్లమ్మ టెంపుల్, స్కందగిరి ఏరియా, బ్రూక్‌బాండ్ ఏరియా, అంబేడ్కర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్స్, జస్తా హోటల్, మోక్ష హోటల్, పీఎం మోదీ కాంప్లెక్స్, హనుమాన్ టెంపుల్ ఎదురు ప్రాంతం, బుద్ధభవన్ ప్రాంతం. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జయచంద్ర ఎన్‌క్లేవ్, పంచశీల్ పార్కు, గరోండా ఎన్‌క్లేవ్, ఇండేన్ గ్యాస్, శ్రీపద్మావతి రెసిడెన్సీ, హిమబిందు రెసిడెన్సీ, ఫుడ్ మార్ట్, రాణిగంజ్ బస్ డిపో, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఏడీఈ ఆదినారాయణరావు పేర్కొన్నారు.

నేడు ఐనోన్ చర్చిలో మెన్స్ ఫెలోషిప్ మీటింగ్

లాలాపేట: ఐనోన్ చర్చ్ అండ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం (నేడు) మెన్స్ ఫెలోషిప్ మీటింగ్‌ను నిర్వహిస్తున్నట్లు చర్చి ఫౌండర్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఆర్. విలియం కేరి సోమవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. విజయ డెయిరీ సమీపంలోని తార్నాక ఐనోన్ చర్చిలో ఉదయం 7 గంటలకు ఈ మీటింగ్ ప్రారంభమవుతుందని మరిన్న వివరాలకు 9908191315 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందజేస్తున్న జస్టిస్ జి. చంద్రయ్య

పద్మారావునగర్: ప్రముఖ సంఘ సేవకులు, రియల్ వివేక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బోయిగూడ నివాసి ఎం. శ్రీనివాస్ గుప్తాకు డాక్టరేట్ లభించింది. నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా శ్రీనివాస్ డాక్టరేట్ అందుకున్నారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో అనాథ శవాలను, రోడ్డు ప్రక్కన పడి ఉండే అభాగ్యుల పట్ల మానవత్వాన్ని చాటుకుంటున్న శ్రీనివాస్‌కు మంచి పేరుంది. ఏషియా వేదిక్ రీసెర్చ్ ఫౌండేషన్, రామకృష్ణవేణి సేవా సొసైటీలు సంయుక్తంగా శ్రీనివాస్ గుప్తాకు డాక్టరేట్ అందజేశారు.

ఉద్యోగాల పేరిట మోసం చేస్తున్న వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి

అమీర్‌పేట: ఆస్టర్ ప్రైమ్, ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు అమాయకులను మోసం చేస్తున్నారని ఆస్పత్రి అధికారులు తెలిపాయి. ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్నట్లు బాధితులు కొందరు సంస్థ దృష్టికి తీసుకొచ్చారని అలాంటి వారి మాటల నమ్మరాదని సూచించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాల్లోని 16 నగరాల్లో ఉన్న ఆసుపత్రులలో దాదాపు 20 వేల మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. ఉద్యోగ వేటలో ఉన్న వారిని మోసం చేస్తూ డబ్బులు దండుకుంటున్న వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

సికింద్రాబాద్ డీఈఓ బదిలీ

సీఈఓకు అదనపు బాధ్యతలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్ (డీఈఓ) కపిల్ గోయెల్ ఢిల్లీ కంటోన్మెంట్ అడిషనల్ సీఈఓగా బదిలీ అయ్యారు. శ్రీనగర్ సర్కిల్‌లో డీఈఓగా పనిచేస్తున్న తెలుగు అధికారి భూపతి రోహిత్ సికింద్రాబాద్ డీఈఓగా రానున్నారు. ఆయన రాక కాస్త ఆలస్యం కానున్న నేపథ్యంలో అప్పటి దాకా కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌కు డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించనున్నట్లు రక్షణ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉండగా ఇప్పటి దాకా ఢిల్లీ సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ మాజీ సీఈఓ ఎస్‌వీఆర్ చంద్రశేఖర్ డిప్యూటేషన్‌పై కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖలో చేరనున్నారు. బెంగళూరు కేంద్రంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా చేరనున్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానంలోని పలు ఆలయాల్లోని 20 హుండీల్లో భక్తులు కానుకలు ద్వారా అందించిన ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 96 రోజులకు రూ.8,23,422 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.

నేడు చండీ హోమం

సనత్‌నగర్: అధిక శ్రావణమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం దుర్గామాత ఆలయంలో మంగళవారం ఉదయం 8 గంటలకు చండీహోమం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో ఉదయం 9.30 గంటలకు దత్త హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఫలహార బండ్ల ఊరేగింపు



ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి



ఆటోయూనియన్ ఆధ్వర్యంలో జరిగిన తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న శ్రీ గణేష్



పోతరాజులతో కలిసి ఫలహారబండ్ల ఊరేగింపులో సదా కేశవరెడ్డి

రసూల్‌పురా: శ్రావణమాస బోనాల జాతరలో భాగంగా అన్నానగర్‌లో జరిగిన బోనాల వేడుకల్లో సోమవారం పలువురు వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు తొట్టెలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అదేవిధంగా గౌరై పాట్లీళ్లను కట్టి ఫలహార బండ్లను ఊరేగించి నైవేద్యం సమర్పించారు. అన్నానగర్ ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన తొట్టెల ఊరేగింపులో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్, అన్నానగర్‌లో జరిగిన ఫలహార బండ్ల ఊరేగింపులో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్, మణికంఠ. రాజయ్య గౌడ్, వినయ్, నరసింహ్మా, పాండు, వెంకటేష్ పాల్గొన్నారు.

అడ్డగుట్ట వడ్డెరబస్తీలో..

అడ్డగుట్ట: బోనాల పండుగను పురస్కరించుకొని అడ్డగుట్ట వడ్డెరబస్తీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డిలతో పాటు స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ నిర్వాహకులు దండుగుల వెంకటస్వామి, మోహన్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ బీఆర్‌ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో ..

చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్ చింతబావి రజకసంఘం ఆధ్వర్యంలో ఈదమ్మ ఆలయం వద్ద సోమవారం బోనాల జాతర వేడుకలు సందడిగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీ పాలు, పుష్పాలతో అలంకరించారు. డప్పుల ద రువులతో ఊరేగింపుగా తెచ్చిన బోనాలను అమ్మవారికి సమర్పించారు. మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, బీజేపీ నాయకుడు బండా చంద్రారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘ ప్రతినిధులు ఉమాకాంత్, రమేష్, నాయకులు రాజేష్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న కార్తీకరెడ్డి

అర్హులందరికీ బీసీబంధు



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి అర్హులైన లబ్ధిదారులందరికీ బీసీబంధు ఇస్తామని డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ తెలిపారు. తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు బీసీ బంధు దరఖాస్తు దారులు బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర అధ్యక్షుడు ఆలకుంట హరిబాబు నేతృత్వంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి డిప్యూటీ స్పీకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని అర్హులందరికీ బీసీ బంధు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఆగస్టు 1న సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తామన్నారు.

మంత్రిని కలిసిన నూతన ఇన్‌స్పెక్టర్లు



సనత్‌నగర్: బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన పలువురు సీఐలు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో మంత్రిని మహంకాళి సీఐగా బాధ్యతలు చేపట్టిన పరశురాం, ఎస్‌ఆర్‌నగర్ సీఐ రాంప్రసాద్, మోండా మార్కెట్ సీఐగా వచ్చిన రామకృష్ణ కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా రవి



బన్సీలాల్‌పేట్: గాంధీనగర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎన్. రవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మోహన్‌రావు ఎస్‌బీకి బదిలీ అయ్యారు. మంగళ్‌హాట్ స్టేషన్‌లో పనిచేసిన ఎన్. రవి గాంధీనగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల అదుపునకు నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా రాంప్రసాదరావు



అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా రాంప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు. ఇదే స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సైదులును నార్త్ జోన్ టాస్క్‌ఫోర్సుకు బదిలీ చేశారు.

పొంగులేటి కాంగ్రెస్‌లో చిచ్చుపెడుతున్నారు

డీబీ దేవేందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్, తదితరులు

కంటోన్మెంట్: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంటోన్మెంట్ కాంగ్రెస్‌లో చిచ్చుపెడుతున్నారంటూ ఆ పార్టీ సీనియర్ నేత డీబీ దేవేందర్ ధ్వజమెత్తారు. సోమవారం పికెట్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 45 ఏళ్లుగా కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ జెండా మోస్తున్న తనతో పాటు పలువురు సీనియర్ నేతలు అవమానించేలా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించడం సరికాదన్నారు. ఆదివారం కంటోన్మెంట్‌కు వచ్చిన పొంగులేటి తమకు సమాచారం ఇవ్వకుండానే కొందరిని పార్టీలో చేర్చుకోవడంతో పాటు తన వర్గానికి చెందిన వ్యక్తికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. పొంగులేటి అంటే తమకూ అభిమానం ఉందని, అయితే సీనియర్లుగా తమకు తగిన గౌరవం ఇస్తే బాగుండేదన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రయత్నించే వ్యక్తిగా ఇక్కడి పార్టీ క్యాడర్‌ను డిస్టర్బ్ చేయొద్దన్నారు. గతంలో సత్తుపల్లి నుంచి రెండుసార్లు ఓడిపోయిన పిడమర్తి రవి లాంటి నేతకు కంటోన్మెంట్ టికెట్ ఎలా ఇప్పిస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ప్రకాశ్, హరి, బాబూరావు, సాల్మన్, ఇమామ్, దాస్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి



నాయకులతో సమావేశమైన సుధాంశ్

సికింద్రాబాద్: పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతుల విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సికింద్రాబాద్ ఎన్నికల అధికారి, డిప్యూటీ కమిషనర్ ఎన్.సుధాంశ్ కోరారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఆయన వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన, కూలిన పోలింగ్ కేంద్రాల భవనాలను గుర్తించామన్నారు. ప్రత్యామ్నాయ భవనాలను ఎంపిక చేసి ఎన్నికల కమిషన్ ఆమోదం కోసం పంపించామన్నారు. అదే తరహా భవనాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తేవాలన్నారు. ఓటర్ల జాబితా సవరణల పనుల నిమిత్తం బూత్‌లెవల్ ఆఫీసర్లు ఇంటింటి పర్యటనలు చేస్తున్నట్లు చెప్పారు. సర్వే చేస్తున్న బీఓఎల్ బృందాలకు సరైన వివరాలు అందించేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సహాయక ఎన్నికల అధికారి హేమలత, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి కే.భుజేందర్‌బాబు, నాయకులు రాజసుందర్, జలంధర్‌రెడ్డి, ప్రకాశ్, ప్రవీణ్, నర్సింహులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

లాలాపేట: రూ. 2 లక్షలు ఉన్న ప్రమాద బీమాను రూ. 5 లక్షలకు పెంచడం వల్ల సీఎం కేసీఆర్ భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం తార్నాకలోని టీటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రేడ్ యూనియన్(టీటీయూసీ) ప్రధాన కార్యదర్శి సంటి కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శి నానూ నాయక్ పాల్గొన్నారు.

85 మంది రైల్వే ఉద్యోగుల పదవీ విరమణ

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వేలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 85 మంది ఉద్యోగులు సోమవారం పదవీ విరమణ పొందారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలా గూడ వర్క్‌షాప్‌లో వీరు విధులు నిర్వహించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, అధికారులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు సందడిగా మారాయి. రైల్ నిలయంలో అకౌంట్స్ విభాగంలో అకౌంట్స్ ఆఫీసర్ రంగసాయి బాబు, జీ. రామకోటేశ్వర రావు, సంచాలన్ భవన్‌లో పి. వెంకటేశ్వరరావు, నరసింహం తదితరులను ఎంప్లాయిస్ సంఘ్ మీడియా కోఆర్డినేటర్ షేక్ రవూఫ్, మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచి కార్యదర్శి చింతకుంట రామకృష్ణ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.

అంతర్జాతీయ సదస్సులో లక్ష్మయ్య

లాలాపేట: బ్యాంకాక్‌లో జూలై 21 నుంచి 26 వరకు జరిగిన అంతర్జాతీయ స్పోర్ట్స్ సదస్సులో తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. బి. లక్ష్మయ్య పాల్గొన్నారు. ఈ సదస్సులో 'ఉస్మానియా యూనివర్సిటీ కార్ఫ్ బాల్ అండ్ నెట్‌బాల్ ఆటగాళ్ల పవర్ అండ్ స్పీడ్-ఏ కంపారేటివ్ స్టడీస్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. సదస్సు ముగించుకుని సోమవారం నగరానికి వచ్చిన లక్ష్మయ్యను రాష్ట్ర ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.జయప్రద బాయి సన్మానించారు.

భూమిపూజ

రసూల్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై లక్ష మంది విద్యార్థులతో నేడు (మంగళవారం) సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో కదనభేరి చేపడుతున్నామని బీజేపీ రాష్ట్ర నాయకులు ఆకుల నాగేష్ తెలిపారు. సోమవారం పరేడ్‌గ్రౌండ్‌లో కదనభేరి కార్యక్రమానికి విద్యార్థులతో కలిసి నాగేష్ భూమిపూజ చేశారు.

సెల్‌ఫోన్ చోరీల ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో చేయాలి



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందిస్తున్న షేక్‌సలీమా

సికింద్రాబాద్: సెల్‌ఫోన్లు చోరీకి గురైన సందర్భాల్లో రైలు ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసుకోవాలని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ షేక్ సలీమా కోరారు. సోమవారం రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. రైలు ప్రయాణికుల సెల్‌ఫోన్లు ఎక్కడ చోరీకి గురైనా రైల్వే పోలీస్‌స్టేషన్ వరకు వచ్చే పనిలేకుండా సెంట్రల్ ఎక్యుప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) యాప్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చాన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి రైల్వే పోలీసులకు ఈ యాప్ అందుబాటులోకి వచ్చిందని అప్పటి నుంచి ఇప్పటి వరకు తమకు 101 ఫిర్యాదులు యాప్ ద్వారా రాగా 46 ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు, ఎన్‌జీఓ ప్రతినిధుల సహకారంతో 13 కేసుల్లో 200 మంది బాల కార్మికులను సంరక్షించి వసతిగృహాలు, తల్లితండ్రులకు అప్పగించామన్నారు. ఆంధ్రా–ఒడిస్సా మార్గంలో నడిచే రైళ్లలో గంజాయి అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుందని ఇప్పటి వరకు 3442 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 151 మందిని రిమాండ్‌కు తరలించామని మరో 8 మంది నిందితులపై పీడీ యాక్టు నమోదు చేసినట్టు తెలిపారు. సమావేశంలో రైల్వే డీఎస్పీ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను తదితర అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

అమీర్‌పేట: పబ్లిక్ టాయిలెట్స్‌లోని ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ గుర్తు తెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గత నెల 29న సెయింట్ థెరిస్సా ఆస్పత్రి ఎదుట గుర్తు తెలియని మహిళ ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటాన్ని గమనించి స్థానికులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఆస్పత్రికి వెళ్లి ఆమె వాంగ్మూలం తీసుకోగా తన పేరు ఎం.పద్మ, భర్త పేరు వేణుగోపాల్ అని మరోసారి రహమత్‌బీ అని తెలిపింది. భర్తతో పాటు తన కొడుకు తనను సరిగా చూసుకోకపోవడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని, ఆమె వద్ద ఇంకా ఎలాంటి సమాచారం లేక పోవడంతో గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అందరి సహకారంతో ఘనంగా బోనాలు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మంత్రి తలసానిని కలిసిన దేవాదాయ శాఖ అధికారులు

సనత్‌నగర్: అందరి సహకారం, కృషితో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బోనాల ఉత్సవాలు ముగిసిన సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు సోమవారం రాష్ట్ర సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో కలిశారు. వివిధ ఆలయాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లను చేసిన కారణంగా లక్షల సంఖ్యలో భక్తులు వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా దర్శనం చేసుకున్నారన్నారు. బోనాల ఉత్సవాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుపుకుంటున్న విషయాన్ని గుర్తుచేశారు. దేవాదాయ శాఖలోని అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది బోనాల ఉత్సవాల నిర్వహణలో ఎంతో కృషి చేశారని మంత్రి అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్లు బాలాజీ, కృష్ణ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



వీహెచ్ హనుమంతరావును కలిసిన రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి కట్టుబడి పనిచేస్తూ రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీహెచ్ హనుమంతరావును సోమవారం కలిసిన ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం నాటి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నుంచి మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వరకు బీసీల అభివృద్ధికి కృషి చేశారన్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం బీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు ఇవ్వడం లేదని, దీంతో లక్షలాది మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, కమల్‌రాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ సేవలు



ఆన్‌లైన్ సేవలను ప్రారంభించిన శ్రీగణేశ్

కంటోన్మెంట్: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడటమే తమ ఫౌండేషన్ లక్ష్యమని శ్రీగణేశ్ ఫౌండేషన్ చైర్మన్, శ్రీగణేశ్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల వినియోగానికి సంబంధించిన ఉచిత ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టారు. సోమవారం కంటోన్మెంట్ పరిధిలోని ఐదు వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పథకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు, మార్పులు, చేర్పుల ప్రక్రియలో అవగాహన లేమితో చాలా మంది అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. తన వద్దకు సాయం కోసం వచ్చే వారిలో మెజారిటీ సమస్యలు ఇలాంటివే ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో నేరుగా ప్రజల వద్దకే వెళ్లి సేవలు అందించే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామన్నారు. నూతన రేషన్ కార్డులు, కొత్త ఓటర్, ఆధార్ కార్డులు, వృద్ధాప్య, వివిధ ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రజల ఇంటివద్దే ఉచితంగా అందిస్తున్నామన్నారు. రెండో వార్డులో సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ వద్ద, మూడో వార్డులో ఖార్ఖానా ముత్యమరియమ్మ ఆలయం సమీపం, నాలుగో వార్డులో గాంధీకాలనీ, ఐదో వార్డులో కాకాగూడలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించామన్నారు.

'నా బిడ్డలను కాపాడుకుంటా'



భవిష్యవాణి వినిపిస్తున్న శోభారాణి

రసూల్‌పురా: నా బిడ్డలకు ఏ ఆపద రాకుండా కాపాడుకుంటానని భవిష్యవాణి రంగంలో వినిపించారు. బోనాలా జాతరలో భాగంగా అన్నానగర్ పోచమ్మ ఆలయంలో సోమవారం జరిగిన రంగం కార్యక్రమం వెస్ట్‌మారేడుపల్లికి చెందిన శోభరాణి పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి వినిపించారు. తెలంగాణ వచ్చాక కేవలం నాయకులు బాగుపడుతున్నారు కానీ.. ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిదన్నారు. ఆలయానికి ధ్వజసంభం ఏర్పాటు చేయాలని గ్రామ పూజలు మంచిగా జరిగాయన్నారు. శ్రావణ మాసంలో అందరూ తోటకు లేదా గుళ్లకు వెళ్లి గడపాలని భవిష్యవాణి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దేల యాదగిరి, శ్రీశైలం గౌడ్, పరిమళ్ల వెంకటేష్ సుంకన్న, నాగరాజు, దేవులపల్లి శ్రీనివాస్, కుమార్ గౌడ్, సత్తయ్య. కనకయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పోరాడుదాం



మాట్లాడుతున్న మందకుమార్ మాదిగ

బౌద్ధనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించుకునే ఆశయ సాధనలో అంతిమ యుద్ధానికి మాదగ సమాజం సిద్ధం కావాలని ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మందకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం ఎంఎస్పీ సికింద్రాబాద్ కోఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ మాదిగ అధ్యక్షతన పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాటలు చెబుతున్నారే కాని చేతల్లో చూపడం లేదన్నారు. పదేళ్ల దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉండి కూడా వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టకపోవడంతో దారుణమన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బీజేపీని మాదిగలతో పాటు ఇతర కులాల ప్రజలూ నమ్మబోరన్నారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు పెట్టాలని ఈ కీలక సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ వర్గీకరణకు మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం ఆగస్టు రెండో వారంలో ఛలో హైదరాబాద్ పేరుతో లక్షలాది మందితో మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నరసయ్య, చాగంటి యాదగిరి, విక్కీ, మోహన్‌రావు, త్రినేత్ర, నర్సింగ్‌రావు, శివప్రసాద్, డప్పు మహేష్, గడ్డం కృష్ణ పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం



పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్‌లో రూ.47 లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, శ్యాంలాల్ బిల్డింగ్ తాతాచారి కాలనీ ప్లేగ్రౌండ్‌లో ఓపెన్ జిమ్ ప్రారంభించారు. అనంతరం ద్వారకాదాస్ పార్కులో ఓపెన్ జిమ్, ఆట పరికరాలు, ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో బేగంపేట డివిజన్‌లోని పలు ప్రాంతాలు పల్లపు ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలంలో వరద వచ్చి చేరేదని ప్రస్తుతం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తీసుకున్న నాలాల అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ముంపు సమస్యను కొంతమేర తీర్చగలిగామన్నారు. బేగంపేట డివిజన్‌లో రోడ్లు, మంచి నీరు, పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచండి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎన్.సుధాంశ్‌తో సోమవారం ఆమె సమావేశమై డివిజన్ పరిధిలోని పలు సమస్యలను వివరించారు. డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని డివిజన్ విస్తీర్ణం పెద్దగా ఉండి కార్మికులు తక్కువ సంఖ్యలో ఉండటంతో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో కావడం లేదన్నారు. అవసరమైన సిబ్బందిని నియమించి డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేసి ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు.

సమస్యల పరిష్కారానికి చొరవ

రసూల్‌పురా: ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ ప్రత్యేక చొరవ తీసుకుని వివిధ అభివృద్ధి పనులు చేపడుతోందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకష్ణ పేర్కొన్నారు. సోమవారం బోర్డు ఎనిమిదో వార్డు బొల్లారం సరస్వతి నగర్‌లో రూ.12 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైపులైను ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సరస్వతినగర్ కాలనీవాసులు అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నప్పటికీ గత టీఆర్‌ఎస్ పాలకులు కాలనీలో అభివృద్ధిని విస్మరించారని అన్నారు. కాలనీవాసులు సమస్యలను తన దృష్టికి తీసుకురాగానే స్పందించి యుద్ధ ప్రాతిపదికన యూజీడీ పైపులైను పనులు చేపట్టామన్నారు.